


సూర్యాపేటలో ఐటీ హబ్ ప్రారంభించి బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తదితరులు

# కడుపు నిండా సంక్షేమం.. కంటి నిండా అభివృద్ధి

## ఇతర జిల్లాలకు పోటీగా సూర్యాపేట ప్రగతి

- ఇంకా కోరేందుకు సూర్యాపేటలో ఏమైనా మిగిలి ఉన్నాయా?
- మంత్రి జగదీశన్న కష్టమే 24 గంటల కరెంట్ ఫలితం
- ఈ సారి జగదీశ్‌రెడ్డి 50 వేల మెజారిటీ ఖాయం
- రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్
- సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఐటీ హబ్ ప్రారంభోత్సవం
- రూ.530 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- అనంతరం బహిరంగ సభలో ప్రసంగించిన మంత్రులు
- ఐటీ హబ్‌లో ఉద్యోగులతో మంత్రి కేటీఆర్ ఇంటరాక్షన్
- రానున్న రోజుల్లో మరింత విస్తరిస్తామని హామీ
- ప్రజల సంక్షేమమే నా ఎజెండా : మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ)/సూర్యాపేట : రాష్ట్రంలో 24 గంటల కరెంటు రావట్లేదని, రైతులు వేసిన పంట పొలాలు ఎండిపోతున్నాయని కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనడంపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చాలా అనుమానాలు ఉన్నాయి. ఎక్కడ వస్తుందో చూపెట్టు అంటున్నడు. 'వెంకన్నా.. ఒకవేళ నీకు ఏమైనా అనుమానాలు ఉంటే ఎక్కడికి వస్తారో చెప్పండి. లేకుంటే సూర్యాపేట జిల్లాలో ఏ గ్రామానికైనా వెళ్లి కరెంట్ తీగలను గట్టిగా పట్టుకొండి. కరెంట్ వస్తుందో లేదో తెలుస్తది. లేదంటే కాంగ్రెస్ దరిద్రం పోతుంది' అని మంత్రి కేటీఆర్ అన్నారు. అలాగే మంత్రి జగదీశ్‌రెడ్డికి సూర్యాపేటలో ఈ సారి డిపాజిట్ కూడా రాదని కోమటిరెడ్డి అనడంపై మంత్రి ఫైర్ అయ్యారు. దమ్ముంటే ఆయన సూర్యాపేటలో పోటీ చేయాలి. ఎవరికి డిపాజిట్ రాదో చూద్దామని సవాల్ విసిరారు. సోమవారం సూర్యాపేటలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌ను మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. అలాగే రూ.118 కోట్లతో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం, రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ వాణిజ్య సముదాయం ప్రారంభించగా, అనంతరం జరిగిన సభలో 804 మందికి డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, వీధుల్లో చెప్పులు కుట్టుకునే 18 మంది దళిత కుటుంబాలకు దళితబంధు చెక్కులతోపాటు మెయిన్ రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన 22మంది బాధితులకు ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్‌లో షాపులు కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ అందజేశారు. అలాగే రూ.315 కోట్ల వ్యయంతో చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టీపీ పనులకు మంత్రులు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రభుత్వ నుంచి లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు పెద్దఎత్తున కేటీఆర్‌కు స్వాగతం పలికి భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

### జగదీశన్నకు 50వేల మెజార్టీ ఖాయం..

సూర్యాపేటలో కడుపు నిండా సంక్షేమం, కంటి నిండా అభివృద్ధి చేసిన గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి ఎందుకు ఓటెయ్యాలో మీ కళ్లముందు ప్రత్యక్షంగా కనిపిస్తున్న అభివృద్ధి, అనుభవిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆలోచన చేయాలన్నారు. జగదీశ్‌రెడ్డి కేసీఆర్‌కు తమ్ముడిలా తెలంగాణ ఉద్యమానికి ఆకర్శితులై కేసీఆర్ వెంట నడిచినప్పుడు ఆయన ఏ ఎజెండా పెట్టుకొని రాలేదన్నారు. కేసీఆర్ మాట విన్న తరువాత కేసీఆర్ మాత్రమే తెలంగాణ సాధిస్తాడని ఒక సైనికుడిలా కేసీఆర్ వెంట కదిలి వచ్చిండని గుర్తు చేశారు. నాడు పదవులొస్తాయని రాలే, తెలంగాణ రావాలని వచ్చినం. ఇవాళ ప్రజలు ఆదరించి గెలిపించడంతో ఉద్యమ రీతిన అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సారి జగదీశ్‌రెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపిస్తారనే ధీమాను మంత్రి కేటీఆర్ వ్యక్తం చేశారు. సూర్యాపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే ఇతర జిల్లాలకు పోటీ పడి అభివృద్ధి జరుగుతుందంటే దానికి కారణం మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో ఘనంగా స్వాగతం పలికిన అన్నదమ్ములు, ఆడబిడ్డలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 4 నుంచి 5 కిలోమీటర్ల మేర ర్యాలీకి ఈ స్థాయిలో జనం వచ్చారంటే అవతలి వాళ్లు ఎన్ని ఎత్తులు వేసినా, ఎన్ని కుట్రలు పన్నినా జగదీశ్‌రెడ్డి విజయాన్ని ఆపలేరని పేర్కొన్నారు.

### 2014కు ముందు కరెంటు ఎట్లుండే..


మంత్ర కేటీఆర్ మాట్లాడుతూ.. నాడు కరెంట్ ఎలా ఉండే.. 2014కు ముందు ఏదైనా ఊర్లో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాల తర్వాత స్నానాలు చేసేందుకు కరెంట్ ఉండకపోయేది. డీఈని, ఏఈని బతిమిలాడుకోవాల్సి వచ్చేది అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆ రోజు 6 గంటల కరెంట్ అన్నరు. ఎన్నడన్నా ఒకరోజు సక్కగ ఇచ్చిండ్రా ? అని ప్రశ్నించారు. అలాగే నిన్న నల్లగొండలో కోమటిరెడ్డి అంటడు.. సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డికి డిపాజిట్ రాదంట. దమ్ముంటే సూర్యాపేటకు వచ్చి నిలబడు.. ఎవరికి డిపాటిట్ రాదో చూద్దామని మండిపడ్డారు. అడ్డం, పొడుగు మాట్లాడుతూ దళితబంధులో అక్రమాలు జరిగాయంటున్నరు. ఎక్కడో చూపించాలి. దళితబంధు లబ్ధిదారు రత్నమ్మ మాట్లాడింది నిజం కాదా? అని మంత్రి గుర్తుచేశారు. మంత్రి జగదీశ్‌రెడ్డి నయాపైసా తీసుకోకుండా మాకు అడుగకుండానే దళితబంధు ఇచ్చిండని తనతోపాటు మరో 18 మంది చెప్పులు కుట్టుకునే వారికి ఇచ్చారని చెప్పిందన్నారు.

### ప్రజా సంక్షేమమే నా ఎజెండా : మంత్రి జగదీశ్‌రెడ్డి

మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే తన ఎజెండా తప్ప ఇతర ఎలాంటి వ్యాపకాలు తనకు లేవని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతోనే సూర్యాపేట అభివృద్ధి సాధ్యమైందని, ఇప్పటికే సూర్యాపేటలో రూ.7,500 కోట్లను అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వెచ్చించామన్నారు. ఇంకా నియోజకవర్గంలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే నిధులకు వెనుకాడకుండా సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. 2014లో సీఎం కేసీఆర్ ఏమైతే హామీలు ఇచ్చిపోయారో అవన్నీ సమకూరాయన్నారు. సూర్యాపేట ఎంత అభివృద్ధితోపాటు ఇవాళ ఐటీ హాబ్ వచ్చింది అంటే, ఈ రోజు దానిని ప్రారంభించుకుంటున్నామంటే అందుకు కేటీఆర్ దార్శనికత, పలుకుబడే కారణమన్నారు. సూర్యాపేటలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫికల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభించుకున్నామని, ఇవి దేశంలో ఎక్కడా లేవన్నారు.

### ఆలస్యమైనా రోడ్లను విస్తరించుకున్నాం..

సూర్యాపేటలో రోడ్ల విస్తరణను గతంలో చేయలేదు. నేను అభివృద్ధి చేస్తానని, డబ్బులు ఇవ్వాలని మంత్రి కేటీఆర్‌ను కోరితే వెంటనే రూ.25 కోట్లు ఇవ్వడంతో రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టామన్నారు. అయితే దురదృష్టవశాత్తు కొందరు కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చి పనులు ఆపారని, అయినప్పటికీ ఇప్పుడు పూర్తి చేసుకున్నామన్నారు. సూర్యాపేటలో లక్షలాది మంది బోటును చూసి ఉండరని, బోటు చూడాలంటే కేరళ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని, కానీ ఇవాళ సూర్యాపేటలో బోటులో తీరుగుతున్నామంటే దానికి కారణం కేటీఆర్ అన్నారు. సూర్యాపేట యువత ఇంకా ఉపాధి కావాలని కోరుకుంటుందని, ఇండస్ట్రియల్ మంత్రిగా మీ సహకారం మాకు కావాలని కేటీఆర్‌ను కోరితే.. మీరు వెయ్యి ఎకరాల భూమి తెస్తే 10 వేల మందికి ఉపాధి కల్పించేలా తాను ఏర్పాటు చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారన్నారు. నేడు ఐటీ హబ్‌ను ప్రారంభించగా 15 కంపెనీలు వచ్చాయని, అక్కడ కొందరు యువకులు ఉపాధి పొందుతారని తెలిపారు. సూర్యాపేటకు అద్భుతమైన మెడికల్ కళాశాలను తెచ్చుకునద్నమని, ఇక్కడ 500మంది పిల్లలు చదువుతున్నారని అన్నారు. ఈ సంవత్సరం పీజీ కూడా మొదలతువుతుందని చెప్పారు. మరో రూ.150 కోట్లతో హాస్పిటల్‌ను కూడా ప్రారంభించుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాయాదవ్, శాసన మండలి సభ్యుడు ఎంసీ కోటిరెడ్డి, శాసన సభ్యులు గాదరి కిశోర్ కుమార్, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ కుమార్, అదనపు కలెక్టర్ ప్రియాంక, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కాసోజు శంకరమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వై.వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మారిపెద్ది శ్రీనివాస్, గండూరి ప్రకాశ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు కేటీఆర్, గుండకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

# సూర్యాపేట గులాబీమయం

## బీఆర్ఎస్ శ్రేణులతో దద్దరిల్లిన భానుపురి

- కళాకారుల విన్యాసాలు.. కోలాటలతో నృత్యాలు
- భారీ ర్యాలీతో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి ఘన స్వాగతం
- దారి పొడవునా మంగళ హారతులు, గజమాలలతో సత్కారాలు
- జై కేసీఆర్.. జై కేటీఆర్.. జై జగదీషన్న
- నినాదాలతో హోరెత్తిన సూర్యాపేట వీధులు



సూర్యాపేటలో భారీ ర్యాలీతో మంత్రులకు స్వాగతం

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 2 : సూర్యాపేట జిల్లా కేంద్రం గులాబీ దండుతో దద్దరిల్లింది. సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులు, ఐటీ హబ్‌తోపాటు పలు భవనాలను ప్రారంభించేందుకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూర్యాపేట వీధులన్నీ గులాబీమయంగా మారాయి. స్థానిక ఎస్వీ కళాశాల మైదానంలో స్వాగతం పలికిన అనంతరం అక్కడి నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీ ముందుగా దురాజ్‌పల్లిలోని ఐటీ హబ్ వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి జమ్మిగడ్డలో పలు భవనాల ప్రారంభం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి కొత్తబస్టాండ్ వరకు బైక్‌ర్యాలీతో యువకులు జై కేసీఆర్.. జై కేటీఆర్.. జై జగదీషన్న అంటూ సందడి చేశారు. అనంతరం కొత్త బస్టాండ్ నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు కళాకారుల విన్యాసాలు, కోలాట బృందాల నృత్యాల నడుమ పెద్ద ఎత్తున ర్యాలీగా బహిరంగ సభా ప్రాంగణం వరకు సంబురాల నడుమ మంత్రులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దారి పొడవునా వారికి మహిళలు తిలకం దిద్దుతూ.. మంగళహారతులు పడుతూ.. గజమాలలతో సత్కరిస్తూ పండుగ వాతావరణంలో ర్యాలీ కొనసాగింది. దారి పొడవునా జయ జయధ్వానాలు పలికిన ప్రజలకు అభివాదం చేస్తూ మంత్రులు సభాస్థలికి చేరుకున్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు కేటీఆర్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

### మహాత్మాగాంధీకి నివాళి

పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు సూర్యాపేటకు వచ్చిన మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎంజీ రోడ్డులో గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

### ఆ రెండు హామీలకూ నిధులిస్తాం..

ఇవాళ మంత్రి జగదీషన్న నియోజకవర్గంలో చేసేందుకు ఏమీ లేకపోయినా.. లక్ష్మీ టాకీస్ రోడ్డుతో పాటు పుల్లారెడ్డి చెరువు మినీట్యాంక్ బండ్‌కు మరికొన్ని నిధులు కావాలంటున్నాడు. ఎన్ని నిధులైనా ఇస్తాం.. ఎన్ని పనులైనా పూర్తి చేసుకుందామని 20 నుంచి 30 కోట్లు ఇచ్చేందుకు మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు.



ప్లకార్డులతో మంత్రులకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

### మంత్రి కేటీఆర్ పర్యటన సాగిందిలా..

- ఉదయం 11:10 గంటలకు సూర్యాపేటలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- 11:12 గంటలకు మంత్రి కేటీఆర్‌కు జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్వాగతం పలికారు.
- 11:15 గంటలకు ఐటీ హబ్ ప్రారంభానికి బయల్దేరిన మంత్రి.
- 11:40 గంటలకు ఐటీ హబ్ ప్రారంభం.
- మధ్యాహ్నం 12:06 గంటలకు ఎస్‌టీపీ ప్రారంభానికి బయల్దేరిన మంత్రి.
- 12:08 గంటలకు మంత్రికి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సన్మానం.
- 12:25గంటలకు మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రాంభించిన మంత్రులు.
- 12:57 గంటలకు భారీ ర్యాలీ ప్రారంభం.
- 1:10 గంటలకు సభాస్థలికి చేరుకున్న మంత్రులు.
- 1:27 గంటలకు మంత్రి కేటీఆర్ ప్రసంగం ప్రారంభం.
- 1:49 గంటలకు ప్రసంగం ముగింపు.
- 1:55 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయంలో లంచ్.
- 2:50 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్న మంత్రి కేటీఆర్.
- 2:55 గంటలకు నల్లగొండకు బయల్దేరిన మంత్రి.